01ATP03_01ATP03.qxd 03-04-2026 PM 10:43 Page 1






అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక


# వార్త

శనివారం 04 ఏప్రిల్ 2026 | పేజీలు : 04


# ఏప్రిల్ 6 న జలధార కార్యక్రమంలో పాల్గొనేందుకు యాడికి కి సీఎం చంద్రబాబు రాక

**- ఏర్పాట్లు పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి**

**- యాడికి మండల కేంద్రంలో బహిరంగ సభ**



**అనంతపురం, మార్చి 3, (ప్రభాతవార్త బ్యూరో)**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల ఆరో తేదీన అనంతపురం జిల్లా పర్యటనకు వస్తున్నారు.

జలధార కార్యక్రమంలో పాల్గొనేందుకు యాడికి మండలంలో పర్యటిస్తున్నారు. సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆనంద్, తాడపత్రి ఎమ్మెల్యే అస్మిత రెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్రీ విష్ణు చరణ్, ఇతర జిల్లా అధికారులు, తాడపత్రి నియోజకవర్గ అధికారులు యాడికి లో పర్యటించారు. యాడికి మండలంలోని యాడికి, రాయల్ చెరువు, మరికొన్ని గ్రామాల్లో పర్యటించి చివరకు యాడికి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ స్థలంలో సీఎం పాల్గొనే బహిరంగ సభను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. యాడికి వేములపాడు రోడ్ లో వన్నప్పతోట ఎదురుగా ఉన్న భూముల్లో ఎలిప్యాడ్ ఏర్పాటు చేయనున్నారు. సీఎం పర్యటన లో భాగంగా జలదార కార్యక్రమం కింద సీఎం ఏమి హామీలు ఇస్తాడు అన్నది తాడపత్రి నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. డ్రాప్ ఏరియాగా గుర్తింపు ఉన్న యాడికి మండలం అభివృద్ధికి సీఎం ఏమి హామీలు ఇస్తాడు అన్నది యాడికి ప్రాంత ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇదే సమయంలో ఏప్రిల్ ఆరో తేదీన అనంతపురం జిల్లా లో సీఎం పర్యటన సంబంధించి ఇంకా అధికారికంగా షెడ్యూల్ ప్రకటించాల్సి ఉంది. సీఎం చంద్రబాబు నాయుడు ఆరో తేదీన యాడికి పర్యటనకు మాత్రమే వస్తారా? లేక కళ్యాణ్ దుర్గం మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తారా? లేదా? అన్నది తెలియాల్సి ఉంది. కాగా సీఎం జిల్లా పర్యటనకు వచ్చిన రోజే స్థానిక జేఎన్టీయూ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ హాజరుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సీఎం, రాష్ట్ర గవర్నర్ జిల్లా పర్యటనలను విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ అనంతపురంలో శుక్రవారం అధికారుల సమావేశం ఏర్పాటు చేసుకొని ఆదేశాలిచ్చారూ. రాష్ట్ర గవర్నర్ సోమవారం ఉదయం 9.25 ని"లకు గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి విమానాశ్రయానికి 10.10ని" చేరుకుంటారు. శ్రీ సత్య సాయి ఏర్పోర్ట్ పుట్టపర్తి నుండి అనంతపురంలోని జేఎన్టీయూ కు రోడ్డు మార్గాన 10.25 ని బయలుదేరి"11.25 ని"లకు చేరుకొని ఆయా కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు అనంతపురం నుండి రోడ్డు మార్గాన బయలుదేరి పుట్టపర్తి చేరుకుని కాసేపు విశ్రాంతి అనంతరం సాయంత్రం 6.15 గం.లకు పుట్టపర్తి విమానాశ్రయం నుండి తిరుగుప్రయణం కానున్నారని జాయింట్ కలెక్టర్ వివరించారు.

# బడ్జెట్‌లో కేటాయించే ప్రతి రూపాయిని ప్రణాళిక ప్రకారమే ఖర్చు చేస్తున్నాం

- బడ్జెట్ అనేది సామాన్య ప్రజలకు, అధికారులకు అర్థమయ్యే భాషలో ఉండాలి
- రాష్ట్రానికి ఆదాయం తక్కువున్నా అభివృద్ధి, సంక్షేమంలో ఎలాంటి కాంప్రమైజ్ కాలేదు
- బడ్జెట్ 2026-27 అవుట్‌రీచ్ కార్యక్రమం - రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

**అనంతపురం కలెక్టరేట్ ఏప్రిల్ 03 ప్రభాతవార్త**

బడ్జెట్‌లో కేటాయించే ప్రతి రూపాయిని ఎక్కడ, ఎలా ఖర్చు చేయాలనే దానిపై స్పష్టమైన ప్రణాళిక ఉండాలని, ఆయా శాఖలకు సంబంధించిన బడ్జెట్ ను వివరణాత్మకంగా రూపొందించాలని రాష్ట్ర ఆర్థిక , ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో శుక్రవారం బడ్జెట్ 202627 అవుట్‌రీచ్ కార్యక్రమం నిర్వహించగా, కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ మరియు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బడ్జెట్ రూపకల్పన మరియు దాని అమలులో పారదర్శకత కోసం ఈ బడ్జెట్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్ అనే కొత్త విధానాన్ని ప్రవేశపెట్టారన్నారు. గత 30 ఏళ్ల రాజకీయాల్లో బడ్జెట్ తయారీ విధానంలో వచ్చిన మార్పులను ప్రస్తావించారు. బడ్జెట్ అనేది సామాన్య ప్రజలకు, అధికారులకు అర్థమయ్యే సరళమైన భాషలో ఉండాలని, అది కేవలం అంకెల గారడీగా ఉండకూడదన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు 58 శాతం జనాభా వచ్చినప్పటికీ, ఆదాయం మాత్రం 4546 శాతం మాత్రమే దక్కిందన్నారు. ప్రధాన ఆదాయ వనరు అయిన హైదరాబాద్ వంటి నగరం పక్కకు వెళ్లడం వల్ల ఇండస్ట్రీ మరియు సర్వీస్ సెక్టార్లు తగ్గి, వ్యవసాయ రంగంపై భారం పెరిగిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం దాదాపు 90 కేంద్ర ప్రభుత్వ పథకాలను నిలిపివేయడం వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని, ఇప్పుడు మళ్లీ 85 పథకాలను పునరుద్ధరించామని చెప్పారు. గత బడ్జెట్‌లో హంద్రీనీవా కాలువ పనులను 100 రోజుల్లో పూర్తి చేయడం ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు అందించగలిగామని, అదే స్ఫూర్తితో వెలిగొండ వంటి మేజర్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. ప్రజలు ఇప్పుడు కేవలం శంకుస్థాపనలు చూసి సంతోషపడటం లేదని, పని పూర్తయి ఫలితం అందినప్పుడే సంతృప్తి చెందుతున్నారన్నారు. బడ్జెట్ అనేది కేవలం రాజధానిలో రూపొందించేది కాదని, క్షేత్రస్థాయి అవసరాలకు అనుగుణంగా ఉండాలని ఈ ప్రక్రియను చేపట్టామన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 22 నెలల్లో అనేక ఆర్థిక ఇబ్బందులను అధిగమించి, జీతాలు మరియు పెన్షన్లను సక్రమంగా అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ బడ్జెట్ 202627 అవుట్‌రీచ్ కార్యక్రమం గురించి నియోజకవర్గాల్లో కూడా సమావేశంలో నిర్వహించాలన్నారు. ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధానంగా నాలుగు వనరుల ద్వారా ఆదాయం లభిస్తుందని, ఎక్సైజ్ సుంకం, జిఎస్టి


సమావేశంలో పాల్గొన్న అధికారులు

, మైనింగ్, రిజిస్ట్రేషన్లు ద్వారా ఆదాయం వస్తుందన్నారు. రాష్ట్ర సొంత ఆదాయంలో దాదాపు 99 శాతం కేవలం ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు మరియు పెన్షన్లకే సరిపోతోందన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ మాట్లాడుతూ జిల్లా ప్రొఫైల్ గురించి వివరించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ.మలోల, సిపిఓ అశోక్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, ఎస్డీసి ఆనంద్, డిపిఓ నాగరాజునాయుడు, సమగ్ర శిక్ష ఏపిసి శైలజ, ట్రెజరీ డిడి రమణయ్య, బీసీ వెల్ఫేర్ డిడి ఖుష్బూ కొఠారి, జిల్లా వ్యవసాయ అధికారి రవి, పశు సంవర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్, వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి అర్చన, జిల్లా టూరిజం అధికారి జయకుమార్ బాబు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస యాదవ్, చేనేత జౌళి శాఖ ఎడి వరప్రసాద్, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, డిఈఓ ప్రసాద్ బాబు, ఎల్డిఎం నరేష్ రెడ్డి, ఉద్యాన శాఖ డిడి ఉమాదేవి, డిఎండబ్ల్యుఓ రామసుబ్బారెడ్డి, హౌసింగ్ పిడి శైలజ, డిసిఓ అరుణకుమారి, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎస్ఎంఈలతో యువతకు ఉపాధి

**- ప్రసన్న ఫర్టిలైజర్స్,పౌల్ట్రీ మార్ట్ ప్రారంభించిన మంత్రి సవిత**


పౌల్ట్రీ మార్ట్ ప్రారంభిస్తున్న మంత్రి సవిత

**పెనుకొండ ఏప్రిల్ 3ప్రభాతవార్త**

రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో పెద్ద ఎత్తున ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ,చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఒకరిని పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఆసక్తి కలిగిన యువత ముందుకొస్తే సబ్సిడీ రుణాలు అందజేసి,చిన్న,మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటుకు వెన్నుదన్నుగా ఉంటామన్నారు. శుక్రవారం పెనుకొండ మండలంలోని కొండంపల్లి గ్రామంలో ప్రసన్న కుమార్ నూతనంగా ఏర్పాటుచేసిన ప్రసన్నఎంటర్ప్రైజెస్ ఫెర్టిలైజర్స్,పౌల్ట్రీ ఫీడ్ విక్రయ శాలల ప్రారంభోత్సవంలో మంత్రి సవిత ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు నిర్వహించి ప్రారంభించారు.అనంతరం తనను కలిసి విలేకరులతో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పన కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు రేయింబవళ్లు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో, రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఎంఎస్ఎంఈలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పంచాయతీ పాలనపై విలేకరులు అడిగిన ప్రశ్న కు సమాధానం ఇస్తూ కూటమి రాకతో పంచాయతీలకు పూర్వవైభవం వచ్చిందని తెలిపారు.వైసీపీ పాలనలో నిధుల లేమితో పంచాయతీల్లో పాలన పడకేసిందని మంత్రి మండిపడ్డారు. పాడైపోయిన వీధి బల్బులను సైతం మార్చడానికి కూడా వీలుండేదికాదని చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో ఎందరో వైసీపీ


ప్రసన్నకుమార్ దంపతులను అభినందిస్తున్న మంత్రి

సర్పంచులు ఎన్నో బాధలు పడ్డారన్నారు. మరికొందరు చేసిన అప్పులు తీర్చడానికి వలస కూలీలుగా మారిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు.కూటమి ప్రభుత్వం రాకతో పంచాయతీలకు పూర్వవైభవం ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, రాంపురం మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, సింగిల్ విండో చైర్పర్సన్ పోతిరెడ్డి,మండల కన్వీనర్ ఈశ్వర ప్రసాద్, మాజీ సర్పంచులు పెద్దన్న, సోమశేఖర్, మరువపల్లి నరసింహులు,గుట్టురు సూర్యనారాయణ, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు లక్ష్మీనారాయణ రెడ్డి,టిడిపి నాయకులు, గుట్టూరు మల్లికార్జున, అమ్మవారిపల్లి వాసుదేవరెడ్డి, కురుబవాండ్లపల్లి రామాంజనేయులు, చిన్న పోతన్న,కొండపల్లి వడ్డే శ్రీరాములు, రామకృష్ణారెడ్డి, మరువపల్లి శ్రీనాథ్, నాగప్ప,జనసేన కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ అరాచకంలో పార్టీ గౌరవాన్ని కాపాడారు!

**- తాజా మాజీ సర్పంచులకు ఎమ్మెల్యే కాలవ ప్రశంస**


తాజా మాజీ సర్పంచులతో ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు

**రాయదుర్గం ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

పదవీ కాలం పూర్తయినా పార్టీ నాయకులుగా గ్రామ సమస్యల పరిష్కారం కోసం బాధ్యతగా పనిచేయాలని తాజా మాజీ సర్పంచ్ లకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. రాయదుర్గం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం తాజా మాజీ సర్పంచులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైకాపా పాలనలో అరాచకం, హింస, దౌర్జన్యాలన్నింటికీ తెగించి పోరాడి తెలుగుదేశం పార్టీ గౌరవాన్ని నిలిపారన్నారు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు ప్రజలకు దగ్గరగా పనిచేసే అవకాశం మీకు లభించిందన్నారు. అధికారంలో వారు ఉన్నారని, ఇబ్బందులు, ప్రలోభాలు పెడతారని తెలిసినా వాటన్నింటినీ భరిస్తూ పార్టీ ప్రతిష్టతను కాపాడారన్నారు. పసుపు జెండా గౌరవాన్ని నిలబెట్టిన సర్పంచ్ ల గౌరవార్థం ఈ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. మూడేళ్ల వైకాపా పాలనలో జగన్ అనే దొంగ పాలకుడు గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం మంజూరు చేసిన నిధులను రాత్రికి రాత్రే కాజేశారన్నారు. ఇతర అవసరాలకు ఆ డబ్బు మళ్ళించి గ్రామాల్లో సర్పంచ్ లకు విలువ, గౌరవం లేకుండా చేశారన్నారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో గ్రామీణ అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. గ్రామ పంచాయతీల నిర్వహణ, అభివృద్ధికి ఇస్తున్న నిధులను నేరుగా గ్రామ పంచాయితీల ఖాతాల్లో జమ చేయడం జరుగుతోందన్నారు. తమకున్న అధికారం మేరకు గ్రామంలో అవసరాలను గుర్తించి సర్పంచులు వాటిని ఖర్చు పెట్టుకునే అవకాశం కల్పించారన్నారు. ప్రజా ప్రతినిధుల హక్కులను గౌరవిస్తూ వారి పని వారు చేసుకునేలా కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులను గౌరవిస్తున్నారన్నారు. నేడు తెలుగుదేశం పార్టీ సర్పంచ్ లే కాకుండా వైకాపా సర్పంచులు కూడా చక్కగా పనులు చేసుకుంటున్నామని ఆనందంగా ఉన్నారన్నారు. ఐదేళ్ల సర్పంచుల పదవీకాలం పూర్తవడంతో గ్రామ పంచాయతీలో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైందన్నారు. "తమ పదవీకాలం పూర్తయింది, మాకు వేటితో సంబంధం లేదన్నట్లు" ఎవరు భావించకూడదన్నారు. పార్టీ అధికారంలో ఉన్నందున అదే స్ఫూర్తితో మునుముందు కూడా ప్రజా సమస్యలపై స్పందించాలని గుర్తుచేశారు. ముఖ్యంగా ప్రత్యేక అధికారులు, గ్రామ నాయకులతో సమన్వయం చేసుకుంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా వేసవిలో ఎక్కడ తాగునీటి సమస్య ఎదురుకాకుండా చూసుకోవాలన్నారు. భవిష్యత్తులోనూ అంతే బాధ్యత, పట్టుదలతో పని చేయాలని సర్పంచులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కాదలూరు మోహన్ రెడ్డి, కాలవ సన్నన్న, కురుబ హనుమంతు,బలరామిరెడ్డి, వన్నారెడ్డి తాజా మాజీ సర్పంచులు రాజశేఖర్ రెడ్డి, ఆవులదట్ల వన్నూరుస్వామి, జుంజురాంపల్లి వన్నూరుస్వామి, మారుతీ, జయరాం చౌదరి, సదాశివ, నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.

# నష్ట పరిహారం ఇవ్వకపోతే గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు ఆపేస్తాం

- పరిహారం ఇవ్వరు, పంట పెట్టుకోనివ్వరు
- రైతులపై ఎందుకు అంత నిర్లక్ష్యం
- ఈనెల 10లోపు భూమి నష్ట పరిహారం ఇవ్వకపోతే గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు పూర్తిగా ఆపేస్తాం
- హైవేపై ధర్నా చేసిన బాధిత రైతులు
- గోరంట్ల మండలం కాంగారెడ్డిపల్లి వద్ద ఆందోళనకు దిగిన రైతులు
- హైవే వల్ల 200 ఎకరాలకు పైగా పంట పొలాలకు దారి లేకుండా పోయింది


హైవేలో ధర్నా చేస్తున్న బాధ్యత రైతులు

**గోరంట్ల ఏప్రిల్ 3 ప్రభాత వార్త.**

గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణానికి రైతుల నుంచి భూములు సేకరించి నష్ట పరిహారం ఇవ్వకనే రోడ్డు పనులు పూర్తి చేస్తున్నారని నష్టపరిహారం డబ్బుల కోసం అడిగితే నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని ఈ నెల పదో తేదీ లోపు నష్టపరిహారం ఇవ్వకపోతే హైవే పనులు ఆపేస్తామని బాధ్యత రైతులు గ్రీన్ ఫీల్డ్ హైవే లో ఆందోళన దిగారు. గోరంట్ల మండల కేంద్రం సమీపంలో నిర్మాణ దశలోని గ్రీన్ఫీల్డ్ హైవే లో కాంగారెడ్డిపల్లి రైతులు గ్రీన్ ఫీల్డ్ హైవేలో ధర్నాకు దిగారు. గోరంట్ల పట్టణ సమీపంలోని కాంగారెడ్డిపల్లి గ్రామ సమీపంలో దాదాపు 90 ఎకరాలకు పైగా గ్రీన్ ఫీల్డ్ హైవే పేరుతో రైతుల నుంచి ప్రభుత్వం భూములను సేకరించారు. అయితే భూములు తీసుకుని సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు సంబంధిత రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం రావడంలేదని అయితే జిల్లా కలెక్టర్ రైతుల భూములకు న్యాయమైన నష్టపరిహారం నిర్ధారించినప్పటికీ గ్రీన్ ఫీల్డ్ హైవే అధికారులు ఆ నష్టపరిహారంపై కోర్టుకు వెళ్లారని తద్వారా నెలల కొద్ది కాలయాపన జరుగుతోందని ఆఖరికి రైతులే నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఏకంగా కాంగారెడ్డిపల్లి రైతులు శుక్రవారం గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు చేపడుతున్న వాహనాలను అడ్డుకొని వాటి ముందు బైఠాయించి నిరసన తెలిపారు. మా ప్రాంతం అభివృద్ధి చెందుతుంది అంటే పచ్చని పంటలు పండే భూములను ప్రభుత్వానికి అప్పగించామని అయితే మా భూములు కు రావలసిన నష్ట పరిహారం సకాలంలో మాకు రాకుండా పోయిందని తెలిపారు.దానికి తోడు మా గ్రామం నుంచి కొన్ని సంవత్సరాలుగా పొలాలకు వెళ్లే దారికి అడ్డంగా హైవే నిర్మాణం కావడంతో ఏకంగా దాదాపు 250 ఎకరాలకు పైగా రైతులు ఆ పొలాలకు వెళ్లేందుకు దారి లేకుండా పోయిందని, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పరిష్కరించే నాథుడే లేకుండా పోయాడని వాపోయారు.ఈ కార్యక్రమంలో రైతులు గోవింద్ రెడ్డి, నాగార్జున రెడ్డి, ఉత్తమ రెడ్డి పాల్గొన్నారు.

# కనుమరుగవుతున్న స్త్రీనిధి పథకం..!

**- కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో ఒక్క నయా పైసా అందని రుణం - కళ్ళు మూసుకున్న అధికార యంత్రాంగం - వేయి కళ్ళతో ఎదురు చూస్తున్న మహిళా లోకం**

**కళ్యాణదుర్గం రూరల్ ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

దేవుడు వరమిచ్చిన పూజారి కరుణించలేదన్న చందంగా కళ్యాణదుర్గం నియోజకవర్గం లోని వివిధ మండలాలకు చెందిన మహిళల పరిస్థితి కడుధయనీయంగా మారింది కారణం అధికార యంత్రాంగంలో కానరాని చిత్తశుద్ధి నిలువెల్లా నిర్లక్ష్యం కలసి కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయితున్నప్పటికీ స్త్రీ నిధి పథకం ద్వారా ఒక్క నయా పైసా కూడా రుణం అందలేదంటే ఎవరికీ నమ్మశక్యం కాదు కానీ ఇది అక్షరాలా నిజం ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఎన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన అధికార యంత్రాంగం అమలు చేయడంలో చిత్తశుద్ధి అంకిత భావం తప్పనిసరిగా ఉండాలి అప్పుడే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుంది కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్ల నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మిగిలిన మంత్రివర్గం నేతలు తరచు మహిళా అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు పత్రికా ప్రకటనలుగా మిగిలిపోయి అమలుకు నోచుకోకపోవడం మహిళల ఆర్థిక స్థితిగతులను మార్చకపోవడం చూస్తుంటే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే నన్న చందంగా మారిపోయింది వివరాల్లోకెళితే గత వైకాపా ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ నాయకులు మహిళా సంఘాలలో బినామీ పేర్లతో విచ్చలవిడిగా రుణాలు తీసుకోవడం అలాగే స్త్రీ నిధి పథకంలోనూ తల దూర్చడంతో రుణాలు విరివిగా తీసుకున్న వారందరూ తిరిగి చెల్లించడంలో విఫలమోడంతో ఈ పరిస్థితి దాపురించిందని చెప్పవచ్చు గ్రామస్థాయిలో పనిచేస్తున్న యానిమేటర్లు


కళ్యాణదుర్గం మహిళా సమాఖ్య కార్యాలయం

రుణాల తీసుకున్న వారి ఇళ్ల వద్దకు రికవరీ కోసం వెళితే వారిని బెదిరించడం అప్పు చెల్లించము ఏం చేసుకుంటారో చేసుకోపోండని కొట్లాటలకు దిగడం ఇలాంటి సంఘటనతో సిబ్బంది ఎలాంటి చర్యలు తీసుకోక అక్కడికే వదిలేయడంతో మహత్తర స్త్రీ నిధి పథకం ఇప్పటికీ కోలుకొని పరిస్థితుల్లో ఉందని అభిప్రాయ పడవచ్చు మొదటి నెల కంతు కట్టకపోతే వెంటనే వెళ్లి వారి వద్ద అప్పు చెల్లించేటట్లు చర్యలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్న అభిప్రాయం కూడా వస్తోంది ఒక్క నెల కట్టకపోతే ప్రతి నెల వదిలేయడంతో రెండు సంవత్సరాలుగా అప్పులు పెరిగిపోయి దారుణ పరిస్థితులు నెలకొన్నాయి ఇప్పటికే స్త్రీ నిధి రుణం పొందిన వేలాదిమంది మహిళలు కొత్త రుణం కోసం దరఖాస్తులు చేసుకొని ఏళ్ళు గడుస్తున్నప్పటికీ వారి ఎదురుచూపులు ఎండమావులు మాదిరిగానే మిగిలిపోతున్నాయి సంబంధిత అధికార యంత్రాంగం పరిస్థితులు చక్కదిద్దడానికి మహిళలకు ఆర్థిక స్వావలంబనం కల్పించడానికి తగిన చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా కనిపిస్తోంది నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాలలో స్త్రీ నిధి పథకానికి సంబంధించి వేలాది మంది మహిళలు కొత్తగా రుణం పొందడానికి రోజులు లెక్కబెడుతూ కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూస్తుండటం ఆవేదన చెందుతున్నటం ఆర్థిక ఇబ్బందులతో సతమత మవుతుండడం కనిపిస్తోంది సంబంధిత జిల్లా సాయి అధికారులు కానీ రాష్ట్రస్థాయి అధికారులు కానీ రెండు సంవత్సరాల అయినప్పటికీ శ్రీనిధి పథకం గ్రౌండింగ్ కాకపోవడం పరిస్థితులను అర్థం చేసుకోకపోవడం ఏంటన్న ప్రశ్న తలెత్తుతోంది ఇప్పటికైనా సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకొని మహిళలను ఆదుకోవడానికి ప్రభుత్వం రూపొందించిన పథకాలను సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత వారిపై ఎంతైనా ఉంది ఈ విషయమై జిల్లా స్థాయిలోని స్త్రీ నిధి పథకం సంబంధించిన అధికారి సాగర్ ను వివరణ కోరగా స్త్రీ నిధి రుణాల రికవరీ సక్రమంగా లేకపోవడంతో కొత్తగా రుణాలు మంజూరు చేయలేదని ప్రత్యేక చర్యతో స్త్రీ నిధి లాగిన్ ఓపెన్ చేయించాలని జిల్లా స్థాయి అధికారులకు తెలియజేసినట్లు వివరించారు.

# అశ్వవాహనంపై విహరించిన రంగనాథస్వామి

**తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**


అశ్వవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి

తాడిపత్రి మండలం ఆలూరులో వెలసిన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి అశ్వవాహనంపై విహరించారు. ఉదయం అర్చకులు సుబ్బారావు, రంగనాథశర్మ, ఇంద్రకుమార్‌శర్మ, కిరణ్‌స్వామిలు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, తదితర పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంక రించి రాత్రి అశ్వవాహనంపై ఆలూరు గ్రామంలోని వీధుల్లో మేళతాళాల నడుమ అంగరంగ వైభవంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అదేవిధంగా పారవేట కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఓగేటి రంగనాయకులు, ఆలయ ఇఒ రామాంజ నేయులు, ఆలూరు గ్రామపెద్ద తిరుపాల్‌రెడ్డి, ఆలయ సిబ్బంది కాశీ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

03ATP03_03ATP03.qxd 03-04-2026 PM 10:32 Page 1



# ఆర్ డి టి కి విదేశీ నిధుల లైసెన్స్ పునరుద్ధరణ శుభ పరిణామం

**జనసేన జిల్లా అధ్యక్షులు అహుడ చైర్మన్, టిసి వరుణ్**



**మంచు ఫెర్రర్ ను సత్కరిస్తున్న జనసేన నాయకులు**

**అనంతపురం వైద్యం ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

కరువు ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్డిటి అందిస్తున్న సేవలు ఎంతో అమూల్యమైనమని జనసేన జిల్లా అధ్యక్షులు, అహుడా చైర్మన్ టిసి వరుణ్ అన్నారు. శుక్రవారం ఆయన ఆర్డిటి ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టిసి వరుణ్ మాట్లాడుతూ ఆర్డిటి విదేశీ నిధుల లైసెన్స్ పునరుద్ధరణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకులు మంత్రి నారా లోకేష్, కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు విశేష కృషి చేశారన్నారు. రెట్టింపు ఉత్సాహంతో ఉమ్మడి అనంత జిల్లా ప్రజలకు ఆర్డిటి సేవలను మరింతగా విస్తరింప చేయాలని వరుణ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అంకె ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, సీనియర్ నాయకులు కాయగూర లక్ష్మీపతి, జిల్లా కార్యదర్శిలు కిరణ్ కుమార్, సిద్ధు, నగర ప్రధాన కార్యదర్శి ఇమామ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్పంచ్ పదవీ విరమణ కార్యక్రమం

**నార్పల ఏప్రిల్ 03, ప్రభాతవార్త**

నార్పల మండలం సిద్ధారాచర్ల గ్రామపంచాయతీకి సాకే రామాంజనేయులు ఏప్రిల్ 2, 2021 లో సర్పంచ్ గా గెలుపొందాడు. ఏప్రిల్ 2 2026 నాటికీ తన పదవి విరమణ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా జరిపారు. ఈ సంద ర్భంగా సర్పంచ్ రామాంజనేయులు మాట్లాడుతూ మా పంచాయతీలో గల గ్రామాలైన దుర్గము, సిద్ధరాచర్ల, సిద్ధరాచర్ల కొట్టాల,గొల్లపల్లి, మాలవండ్లపల్లి, కమ్మ కొట్టాల గ్రామాలలో త్రాగునీటి సమస్యను బోర్లు వేసి పైప్లైన్ చేసి పరిష్క రించామన్నారు. సిద్ధరాచర్ల,గొల్లపల్లి, దుర్గం గ్రామ లలో ప్యూరిఫైయర్ వాటర్ ప్లాంట్ ను మంజూరు చేసామన్నారు. స్మశాన వాటికలో పలుమార్లు కంప చెట్లను తొలగించి శుభ్రం చేయించామన్నారు. తరచుగా మా గ్రామాలలో గుండె, కళ్ళు, కిడ్నీ వంటి జబ్బులకు తరచుగా ఉచిత ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి, ఆరోగ్య గ్రామాలుగా తీర్చిదిద్దామన్నారు.దుర్గం గ్రామం లో మారెమ్మ, అయ్యప్ప స్వామి దేవాలయాలకు సొంత ఖర్చుతో రచ్చ కట్టలను నిర్మించ మన్నారు. దుర్గం గ్రామం నందు పాఠశాల లో విద్యార్థులకు పరిశుభ్రమైన నీరు లేకపోతే మా సోదరి మాధవి దేవి జ్ఞాపకార్థం చిన్న ఆర్ఓ ప్లాంట్ ఉచితంగా ఏర్పాటు చేశామన్నారు. గత ఐదేళ్ల కాలంలో ప్రజలకు ఎన్నో సేవలు చేయడంలో సహకరించిన నార్పల సత్యనారాయణ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చామ లూరు రాజగోపాల్, జిల్లా పరిషత్ వైస్ చైర్పర్సన్ వేదాంత నవరత్నమ్మ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కే ప్రభుదాస్ మరియు గ్రామ వాసులు పాల్గొన్నారు.

# జిల్లా మండల అధికారుల ప్రోత్సాహంతోనే పన్ను వసూలు సాధ్యమైంది.

**- పంచాయతీలలో 80 శాతం వసూలు చేయడంతో సన్మానించారు.**

**- పంచాయతీ అభివృద్ధి అధికారి సర్దార్ వలి.**



**సర్దార్ వలీని సన్మానిస్తున్న జిల్లా, మండల అధికారులు.**

**అనంతపురం రూరల్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

అనంత రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ, కురుకుంట పంచా యతీలలో పెండింగ్ ఉన్న పనుల వసూళ్లలో జిల్లా అధికారులైన జడ్పీ సీఈవో శివశంకర్, డిపిఓ నాగరాజు నాయుడు, డి ఎల్ పిఓ విజయ్ కుమార్, డి ఎల్ డి ఓ నాగ శివ లీల, మండల అధికారులు ఎంపీడీవో దివాకర్, డిప్యూటీ ఎంపీడీవో వెంకట నాయుడు ప్రోత్సాహంతోనే పంచాయతీలలో 80 శాతం పన్నులు వసూలు చేయడం జరిగిందని రెండు గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి సర్దార్ వలి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రెండు గ్రామపంచాయతీలలో గల కళాశాలలు, పాఠశాలలు తో పాటు పన్ను చెల్లించని గ్రామ ప్రజల ఇంటి వద్దకు తనతోపాటు జిల్లా మండల అధికా రులు వెళ్లి పన్ను చెల్లించాలని కోరడంతోనే వారు పన్ను చెల్లించడం జరిగిం దన్నారు. సంవత్సరాల కొద్దీ పెండింగ్ ఉన్న పన్నుల వసూలు కావడంలో జిల్లా, మండల అధికారుల ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. రెండు గ్రామ పంచాయతీలలో గల కళాశాలలో పాఠశాల యజమానులతో తనతో పాటు జిల్లా, మండల అధికారులు వారిని సంప్రదించడంతోనే పెండింగ్ ఉన్న పన్ను బకాయిలు చెల్లించారన్నారు. నేను, మా బిల్ కలెక్టర్లు గ్రామాలలో 80 శాతం పన్ను వసూలు చేశామని అధికారులు మమ్మలని ఘనంగా సన్మానించడం జరిగిందని, మాకు సన్మానం జరగడంలో జిల్లా మండల అధికారులకు కృషి ఉందన్నారు. రెండు గ్రామాలు కలిపి రూ. 71, లక్ష 32 వేలు పన్ను వసూలు చేయాల్సి ఉండగా అందులో రూ. 54 లక్షల 42,వేలు అంటే మొత్తం 80 శాతం పన్ను వసూలు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి జమ చేయడం జరిగింద న్నారు. తనతోపాటు మండలంలో పన్ను వసూలు చేసిన పంచాయతీ అభివృద్ధి అధికారులతో పాటు బిల్ కలెక్టర్ ను, కంప్యూటర్ ఆపరేటర్లను అందరినీ జిల్లా, మండలాధికారులు ఘనంగా సన్మానించడంజరిగిందన్నారు.

# వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే



**నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ**

**శింగనమల ఏప్రిల్ 03 ప్రభాతవార్త**

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, గౌరు వెంకటరెడ్డి దంపతుల కుమారుడు జనార్ధన్ రెడ్డి అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతుల కూమార్తె సనాతనిలతో హైదరాబాద్ జేఆర్సీ కన్వెన్షన్ లో వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు సహచర ప్రజా ప్రతినిధులతో కలిసి శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పాల్గొని, నూతన దంపతులను ఆశీర్వదించారు.

# ఈ నెల 5న బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

**అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

ఈ నెల 5న బాబుజగ్జీవన్‌రామ్ 119 జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు జిల్లాకలెక్టర్ కార్యాలయం సిబ్బంది తెలియజేశారు. సప్తగిరి సర్కిల్, చర్చి ఎదురుగా ఉన్న డా.బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద 9:30 జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులచేపూల మాలాంకరణతో కార్యక్రమం మొదలు పెట్టడం జరుగుతుందన్నారు. అనంతరం 10:30 గంటలకు డిపిఆర్‌సి సమావేశ మందిరంలో జిల్లా ప్రజా పరిషత్, అనంతపురంలో సమావేశం నిర్వహించబడునన్నారు.

# మంత్రికి పూర్వపు విద్యార్థుల సత్కారం



**మంత్రిని సత్కరిస్తున్న పూర్వపు విద్యార్థులు**

**అనంతపురం న్యూటౌన్, 3 ఏప్రిల్ ప్రభాతవార్త**

ప్రాధమికొన్నత పాఠశాల, చర్చి స్కూల్ 1969-1976(1 నుంచి 7వ తరగతి) బ్యాచ్ విద్యార్థులు, పూర్వ విద్యార్థి, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ని వారి నివాసములో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంనకు పూర్వ విద్యార్థులు అయిన ఇంజనీర్ సుధాకర్ బాబు కోమలపాటి, పయ్యావుల రాధాకృష్ణ, కృష్ణమూర్తి, మునిసిపల్ ఆఫీస్, రామాంజనేయులు, సబ్ ఇన్స్పెక్టర్, నాగేంద్ర, శివనంద, వెంకటేష్, మురళి, టీచర్ హాజరయ్యారు. మంత్రివర్యులు వారి చిన్ననాటి మిత్రులుతో ఆనాటి స్కూల్ డేస్ గురించి మిత్రులు ఎక్కడ వున్నారు ఏమి చేస్తున్నారు అని పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు స్కూల్ ఆవరణములో కాంక్రీట్ ప్లాటుఫారం వేయించ వలసినదిగా కోరినారు. అందులకు మంత్రివర్యులు సానుకూలముగా స్పందించారు.

# దళితునిపై స్పీకర్ దాడి చేయడం సిగ్గుచేటు

**- స్పీకర్ పై చర్యలు తీసుకోవాలి సాకే హరి**



**నిరసన వ్యక్తం చేస్తున్న సాకే హరి తదితరులు**

**అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

దళితునిపై దాడి చేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడుపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో దళితుల ప్రాణాలకు రక్షణ కరువైందని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో దళితులపై దాడులు పెట్రేగిపోయాయని మండిపడ్డారు. నర్సీపట్నంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు డప్పు వాయిస్తున్న దళితునిపై ఆ కారణంగా దాడి చేయడం దారుణమన్నారు. శాసనసభ స్పీకర్ బహిరంగ ప్రదేశంలో బరితెగించి దాడి చేయడాన్ని తప్పు పట్టారు. పదవి నుంచి తొలగించి శాసన సభ్యత్వాన్ని రద్దు చేయాలన్నారు. అలాగే ఆకివీడు నియోజకవర్గం పెద్ద పేట గ్రామ దళితులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ దాడులకు ఉసిగొల్పడం 57 మంది దళితులపై అక్రమ కేసులు బనాయించిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజుపైన చర్యలు లేవన్నారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఉన్నత స్థానాల్లో ఉండి దౌర్జన్యంగా దాడులు చేస్తుంటే ముఖ్యమంత్రి స్పందించకపోవడం బాధాకరమన్నారు. రైల్వే కోడూరు నియోజకవర్గం జనసేన ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ వేధింపులకు గురైన వీణపై జనసేన పార్టీ నాయకుడు తాతంశెట్టి నాగేంద్ర నడిరోడ్డు మీద ఏకంగా పోలీస్ లాఠి తీసుకొని చితకబాదడం దుర్మార్గమన్నారు. మహిళపై దాడిని అడ్డుకుంటున్న విలేకరులపైన దుర్భాషలాడుతూ దాడికి తెగబడడం మంచిది కాదన్నారు. ప్రజా ప్రతినిధులే ప్రజలపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తుంటే డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మౌనంగా ఉండడం ఏమిటన్నారు. దళితులపై దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకునే వరకు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు. మాల మహానాడు జిల్లా అధ్యక్షులు సుగామంచి శ్రీనివాసులు, బేడ బుడగ జంగం రాష్ట్ర కార్యదర్శి శిరిశాల అంజి, ఎమ్మార్పీఎస్ రాచేపల్లి రామాంజనేయులు, జేఏసీ నాయకులు బాబు, శ్రీధర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# మాసమస్యలను మంత్రివర్గ సమావేశంలో పరిష్కరించండి



**మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఆపస్‌నేతలు**

**అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ మంత్రి కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్)నేతలు కలిసి సమస్యల మీద వినతిపత్రం అందజేశారు. ఏప్రిల్ 10న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని వారు కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు కూటమి ప్రభుత్వంపై విశ్వాసంతో, చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశతో ఎదురుచూస్తున్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా అధ్యక్షురాలు కళ్యాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు, శివప్రసాద్ నాయుడు, వై.రామన్న, హర్షవర్ధన్, జిల్లా కార్యదర్శులు పీజీ రమేష్, అనంతపురం నగర అధ్యక్షులు చిక్కిరప్ప, సూర్య ప్రకాష్, పాల్గొన్నారు.

# అనంతపురంలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

**అనంతపురం క్రైమ్ ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



**రైల్వే స్టేషన్లో తనిఖీలు చేస్తున్న దృశ్యం**

జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాలతో నార్కోటిక్స్ కనుక్కోవడంలో తర్ఫీదు పొందిన జాగిలంతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. అనుమానితులు, వారి బ్యాగులు, లగేజీలను క్షుణ్ణంగా చెకింగులు చేసారు. రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, పార్సిల్ ఆఫీస్ లో డాగ్ స్క్వాడ్ ద్వారా స్థానిక త్రీటౌన్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. సి.ఐ రాజేంద్రనాథ్ పర్యవేక్షణలో శుక్రవారం ఉదయం నుండీ తనిఖీలు చేపట్టారు. డ్రగ్స్ నియంత్రణే లక్ష్యంగా తనిఖీలు కొనసాగాయి. నార్కోటిక్స్ పసిగట్టడంలో తర్ఫీదు పొందిన టైగర్ జాగిలం ద్వారా విస్తృత తనిఖీలు చేశారు. సాధారణ ప్రయాణీకులకు అసౌకర్యం కల్గకుండా ఈ తనిఖీలు కొనసాగాయి. గంజాయి, అక్రమ మద్యం రవాణా జరుగకుండా లోతుగా చెక్ చేశారు. అనుమానాస్పదులు, వారి లగేజీలను టైగర్ జాగిలం ద్వారా లోతుగా తనిఖీ చేశారు. ఏదైనా మాదక ద్రవ్యాల సమాచారం ఉంటే వెంటనే ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 లేదా 112 కు సమాచారం అందించాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# 10 నుంచి కావమ్మ మారయ్య తిరునాల ఉత్సవాలు

**నంబులపూలకుంట, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

ఈనెల పది నుంచి కొత్త రోడ్డు వద్ద కావమ్మ మారయ్య లతిరుణాల ఉత్సవాల కోసం సన్నాహాలు చేస్తున్నట్లు తేదేపా మండల కన్వీనర్ తెలిపారు. కొత్త రోడ్డు వద్దకావమ్మ మారయ్యల తిరుణాల ఉత్సవాల కోసం భూమి పూజలో ఆయన పాల్గొన్నారు.

# వైయస్ జగన్‌ను కలిసిన నూతన ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు



**వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో ఏపిబార్‌కౌన్సిల్ సభ్యులు**

**అనంతపురం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త బ్యూరో**

నూతనంగా ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యులు వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు తమ ఎన్నికపై వైయస్ జగన్ నాయకత్వం, మార్గదర్శకత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, న్యాయవాదుల సంక్షేమం, న్యాయ వ్యవస్థ బలోపేతానికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. వైయస్ జగన్ నూతనంగా ఎన్నికైన సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, న్యాయవాదుల సమస్యలను పరిష్కరించడంలో ముందుండాలని, న్యాయ సేవలు ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. అలాగే న్యాయ వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసం పెంపొందించడంలో బార్ కౌన్సిల్ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ప్రెసిడెంట్ మలసాని మనోహర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జల్లా సుదర్శన్ రెడ్డి, నూతన బార్ కౌన్సిల్ సభ్యులు కొమ్మసాని శ్రీనివాసుల రెడ్డి (ఏపీ హైకోర్ట్), రోళ్ళ మాధవి (ఏపీ హైకోర్ట్), వెంకట్రామి రెడ్డి కొవ్వూరి (ఏపీ హైకోర్ట్), రామిరెడ్డి ఆలూరు (అనంతపురం), బ్రహ్మారెడ్డి వట్టిజొన్నల (గుంటూరు), క్రిష్ణారెడ్డి బి.వి (ఏలూరు) పాల్గొన్నారు.

# అనంత జిల్లాకు దక్కిన అరుదైన సత్కారం



**మాంఛో ఫెర్రర్‌నుసన్మానిస్తున్న తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి తదితరులు**

**అనంతపురం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త బ్యూరో**

దాదాపుగా 11 నెలల పాటు కొనసాగిన ఉద్యమం కోసం పోరాడిన అనంత జిల్లా పేద ప్రజలు, ఎన్నో ప్రజా సంఘాలు, రాజకీయ, రాజకీయేతర పార్టీల సమష్టి కృషికి, కన్న కలలకు ఈరోజు కేంద్ర ప్రభుత్వం నుండి ఎఫ్‌సిఆర్‌ఏ నిధులు సంపూర్తిగా విడుదల చేస్తాం అని అనుమతి దక్కటం నిజంగా అదృష్టంగా భావిస్తున్నామని రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జున రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనంత జిల్లాకు ఆర్‌డిటి సంస్థ కల్పవృక్షంగా ఉన్నది. అటువంటి సంస్థ తిరిగి యధావిధిగా తన కార్యక్రమాలు కొనసాగించుకునేలా ఈరోజు అనుమతి లభించినందుకు, అందుకు నిర్విరామంగా కృషి చేసిన ఆర్‌డిటి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్‌ని రాయలసీమ ఉద్యమ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత బండి నారాయణ స్వామి, సీనియర్ న్యాయవాది రామ్ కుమార్, పుట్లూరు భాస్కర్ రెడ్డి, రాయలసీమ విద్యార్థి సంఘం నాయకుడు వరుణ్, బండి విహారి, కనకం నాగరాజ్ యాదవ్, నూర్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# పాపుల రక్షణకై శిలువ వేయబడ్డ యేసుక్రీస్తు

**- స్మిర్ధ ప్రార్థన మందిరం ఫాస్టర్ వందనం బాబు**



**శిలువలో యేసుక్రీస్తు పలికిన మాటలపై వ్యాపోదేశం చేస్తున్న దృశ్యం.**

**పామిడి, ఏప్రిల్ 03 ప్రభాతవార్త**

ప్రభువైన యేసుక్రీస్తు పాపుల రక్షణకై శిలువ వేయబడ్డారని ఫాస్టర్ వందనం బాబు పేర్కొన్నారు. పట్టణంలోని స్మిర్ధ ప్రార్థన మందిరం నందు శుభశుక్రవారం(గుడ్‌ఫ్రైడే)ను పురస్కరించుకుని ఫాస్టర్ వందనం బాబు ఆధ్వర్యంలో క్రైస్తవులు యేసుక్రీస్తును భక్తిశ్రద్ధలతో స్తుతిస్తూ గీతాలను అలపించి ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షమాపన, రక్షణ, బాధ్యత, ఎడబాటు, నిత్యజీవం, విజయవ, సమర్పణ అంటూ శిలువలో యేసుక్రీస్తు పలికిన మాటలపై ఫాస్టర్ వందనం బాబు వ్యాకోపదేశం చేయగా క్రైస్తవులు శిలువ ధ్యానాన్ని ఆచరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యేసుక్రీస్తు సేవలో నిమగ్నమై సంఘాన్ని మేలుకొల్పటానికి ఎల్లప్పుడూ దేవుని సన్నిదిలో ప్రవచనాలను బోధిస్తూ గీతాలను ఆలపించాలని సూచించారు. పాపుల రక్షణకై శిలువ వేయబడ్డ లోకరక్షకుడైన యేసుక్రీస్తు మూడు రోజులకు నిత్యజీవముతో తిరిగి లేవటం జరుగుతుందని వెల్లడించారు.

# ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధాలనాలపై ఉద్యమం

**- వైసీపీ యువజన విభాగం నేతలు పామిడి సూరి అబ్దుల్ భాసిత్**



**సమావేశంలో మాట్లాడుతున్న పామిడి సూరి.**

**పామిడి, ఏప్రిల్ 03 ప్రభాతవార్త**

ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కూటమి ప్రభుతాన్ని నిలదీస్తూ ఉద్యమిస్తామని వైసీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి పామిడి సూరి, నియోజకవర్గ అధ్యక్షులు అబ్దుల్ భాసిత్ హెచ్చరించారు. పట్టణంలోని అనిమిరెడ్డి ప్యాక్టరీలో వైసీపీ యువజన విభాగం సమావేశాన్ని శుక్రవారం పట్టణ అధ్యక్షులు వినోద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం అని విమర్శించారు. యువతకు నిరుద్యోగ భృతి, 20 లక్షల శాశ్విత ఉద్యోగాలు, మహిళలకు ఆడబిడ్డ నిధి అమలు చేయటంలో పాలకులు విఫలం అయ్యారని ఆరోపించారు. వైసీపీ నిర్మాణంలో యువతే కీలకం అన్నారు. అధినేత జగన్మోహన్‌రెడ్డి, గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి యువజన విభాగానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారని, పార్టీ నిర్మాణం, రాబోవు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా యువత సైనికుల్లా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో గుంతకల్లు మండల అధ్యక్షులు మనోజ్‌కుమార్ స్థానిక నాయకులు శాంతనాయుడు, బోయ వెంకటేష్, ఖధీర్, మహమ్మద్‌రఫీ, ఉదయ్, కేశవ, ఓబులేసు, అనుంపలి ఓబులేసు, జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

**2018 క్వాలిఫైడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలి..**

# లేదంటే రాష్ట్రవ్యాప్త పోరాటం తప్పదు

**అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**


ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న సహాయ ఆచార్యుల పోస్టుల భర్తీ విషయంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ (ఏ.ఐ.వై.ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు జి.సంతోష్ కుమార్ తీవ్రంగా ఖండించారు. మంత్రి నారా లోకేష్ ప్రకటించిన తాజా జాబ్ క్యాలెండర్, గత ఆరేళ్లుగా నియామకం కోసం ఎదురుచూస్తున్న 1,300 మంది అర్హత సాధించిన అభ్యర్థుల గొంతు కోయడమేనని ఆయన విమర్శించారు.

# జిల్లా మండల అధికారుల సహకారంతోనే పన్ను వసూలు సాధ్యమైంది

**- పంచాయతీలలో 80 శాతం వసూలు చేయడంతో సన్మానించారు.**

**- పంచాయతీ అభివృద్ధి అధికారి హిదయాతుల్లా.**

**అనంతపురం రూరల్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**



**హిదయాతుల్లాని సన్మానిస్తున్న జిల్లా, మండల అధికారులు**

అనంత రూరల్ మండలం కక్కలపల్లి పంచాయతీ, రుద్రంపేట పంచాయతీ, కక్కలపల్లి కాలనీ పంచాయతీలలో పెండింగ్ ఉన్న పనుల వసూళ్లలో జిల్లా అధికారులైన జడ్పీ సీఈవో శివశంకర్, డిపిఓ నాగరాజు నాయుడు, డి ఎల్ పిఓ విజయ్ కుమార్, డి ఎల్ డి ఓ నాగ శివ లీల, మండల అధికారులు ఎంపీడీవో దివాకర్, డిప్యూటీ ఎంపీడీవో వెంకట నాయుడు సహకారం తోనే పంచాయతీలలో 80 శాతం పన్నులు వసూలు చేయడం జరిగిందని మూడు గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి హిదయాతుల్లా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడుగ్రామపంచాయతీలలో గల కళాశాలలు, పాఠశాలలు తో పాటు పన్ను చెల్లించని గ్రామ ప్రజల ఇంటి వద్దకు తనతోపాటు జిల్లా మండల అధికారులు వెళ్లి పన్ను చెల్లించాలని కోరడంతోనే వారు పన్ను చెల్లించడం జరిగిందన్నారు. సంవత్సరాల కొద్దీ పెండింగ్ ఉన్న పన్నుల వసూలు కావడంలో జిల్లా, మండల అధికారుల సహకారం ఎంతో ఉంద న్నారు. మూడు గ్రామపంచాయతీలలో గల కళాశాలలో పాఠశాల యజమా నులతో తనతో పాటు జిల్లా, మండల అధికారులు వారిని సంప్రదించడంతోనే పెండింగ్ ఉన్న పన్ను బకాయిలు చెల్లించారన్నారు. నేను, మా బిల్ కలెక్టర్లు గ్రామాలలో 80 శాతం పన్ను వసూలు చేశామని అధికారులు మమ్మలని సన్మానించడం జరిగిందని, మాకు సన్మానం జరగడంలో జిల్లా మండల అధికారుల కృషి ఉందన్నారు. మూడు గ్రామాలు కలిపి రూ. 2 కోట్ల ,35 లక్షల 35 వేలు పన్ను వసూలు చేయాల్సి ఉండగా అందులో రూ. 1 కోటి, 70లక్షల 7వేలు అంటే మొత్తం 80 శాతం పన్ను వసూలు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి జమ చేయడం జరిగిందన్నారు. తనతోపాటు మండలంలో పన్ను వసూలు చేసిన పంచాయతీ అభివృద్ధి అధికారులతో పాటు బిల్ కలెక్టర్‌ను, కంప్యూటర్ ఆపరేటర్లను అందరినీ జిల్లా, మండలాధికారులు సన్మానించడం జరిగిందన్నారు.

# ఎం ఎస్ ఎస్ సేవా సంస్థ కు 12ఏ, 80జి అనుమతి లభించింది

**- సంస్థ అధ్యక్షులు ఎం ఎస్ ఎస్ సాదిక్ వలి.**

**అనంతపురం రూరల్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**



**ఎం ఎస్ ఎస్ సాదిక్ వలి**

అనంత రూరల్ మండలం రుద్రం పేట గ్రామపంచాయతీకి చెందిన వైఎస్ ఆర్సిపి పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం ఎస్ ఎస్ సాదిక్ వలి ఏర్పాటుచేసిన ఎం ఎస్ ఎస్ సేవా సంస్థకు 12ఏ, 80జి కేంద్ర ప్రభుత్వం, ఇన్కమ్ టాక్స్ అధికారులు అనుమతి ఇవ్వడం జరిగిందని ఆ సంస్థ అధ్యక్షులు ఎం ఎస్ ఎస్ సాదిక్ వలి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా రుద్రంపేట గ్రామపంచాయతీ లోని పేద ప్రజలకు సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతు, ప్రజలకు మా సంస్థ ద్వారా మేము అందిస్తున్న సేవల వల్లనే కేంద్ర ప్రభుత్వం, ఇన్కమ్ టాక్స్ అధికారులు మా సేవలను గుర్తించి మా సంస్థకు 12ఏ,80జి అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. ఈ గుర్తింపు రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ, ఈ అనుమతుల ద్వారా సంస్థకు దాతలు ఇచ్చే విరాళాలకు పన్ను మినహాయింపు లభిస్తుందని, తద్వారా రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి మార్గం సుగమం అయిందని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని కాపాడుకుంటూ, సమాజంలోని అణగారిన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తామని, ప్రజా సేవలో మరింత చురుగ్గా పాల్గొంటూ అందరి మన్ననలు పొందడమే తమ సంస్థ ప్రధాన ఉద్దేశమన్నారు. మా సంస్థ కు 12 ఏ 80 జి వచ్చిందనితెలుపుటకు మాకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. సంస్థ తరుపున మేము ఇంక ప్రజా సేవలో మరింత ముందుకు సాగి ప్రజలందరి మన్ననలు పొందుతూ నిత్యం ప్రజాసేవలో ఉంటామని ఆయన తెలిపారు.

# ఐ హెచ్ ఆర్ జాతీయ ఉపాధ్యక్షులుగా షేక్ నదీం

**అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**



**షేక్ నదీం హుస్సేన్**

ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ (ఐ హెచ్ ఆర్) జాతీయ ఉపాధ్యక్షులుగా షేక్ నదీం హుస్సేన్ ఎంపిక చేశారు. ఈ మేరకు శుక్రవారం ఐ హెచ్ ఆర్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ యూనస్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా షేక్ నదీం మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ ఉపాధ్యక్షులుగా ఎంపిక చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ.. జాతీయ అధ్యక్షులు డాక్టర్ యూనస్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని షేక్ నదీం తెలిపారు.

# పరిటాల సిద్ధార్థను కలిసిన రాచానపల్లి టిడిపి నాయకులు

**అనంతపురం రూరల్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**



**పరిటాల సిద్ధార్థను కలసిన రాచనపల్లి టిడిపి నాయకులు**

రాప్తాడు నియోజకవర్గం టీడీపీ యువ నాయకుడు, అనంత రూరల్ మండల ఇన్చార్జ్ పరిటాల సిద్ధార్థ ని శుక్రవారం ఆయన నివాసంలో రాచానపల్లి పంచాయతీ టిడిపి నాయ కులు బద్దెల మంజునాథ్, దుర్గం రవి, ఓబుళపతి, గోపాల్ మలరాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పరిటాల సిద్ధార్థ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మన టిడిపి సైనికులు అందరూ కలిసికట్టుగా ముందుకు పోయి ప్రతి గ్రామంలో టిడిపి జెండాను ఎగరవేయాలని ఆదేశించారు.

# చిన్నజలాలపురంలో చలివేంద్రం ప్రారంభం




**చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం**

**శింగనమల ఏప్రిల్ 03 ప్రభాతవార్త**

మండల పరిధిలోని చిన్న జలాలపురం గ్రామంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఆదేశాల మేరకు శుక్రవారం టీడీపీ నాయకులు సుధాకర్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. మొదటిరోజు ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామస్తులకు మజ్జిగ. చల్లని నీరు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుధాకర్. ఆది. గోపాల్. ధనుంజయ. నారాయణస్వామి. నరసింహులు. ప్రసాద్. రాజు. ఆదినారాయణ. రాజశేఖర్. తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో విద్యాభ్యాసం వసతి సౌకర్యాలు బాగున్నాయా- మంత్రి సవిత

**మునుపటి రోజుల కంటే ఇప్పుడు చాలా చక్కగా ఉన్నాయని సమాధానం తెలిపిన కేజీబీవీ విద్యార్థినిలు**




విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న మంత్రి సవిత , నిర్మాణ పనుల గురించి వివరాలు అడిగే తెలుసుకుంటున్న మంత్రి సవిత

**రొద్దం. ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

మండల పరిధిలోని కేజీబీవీ పాఠశాలను బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మండల నాయకులతో కలిసి శుక్రవారం సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల గదులు ఆవరణములో కలియతిరిగి విద్యార్థులతో విద్యాబోధన భోజన సౌకర్యాలు వసతి పలు విషయాలపై ఆరా తీయడం జరిగింది. విద్యార్థులు మంత్రి సవిత అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ మునుపటి రోజుల కంటే ఇప్పుడు అన్ని సౌకర్యాలు బాగున్నాయని ఎస్ ఓ నాగరత్న స్కూల్ సిబ్బంది మాపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని విషయాలలో జాగ్రత్తలు తీసుకుంటున్నారని మీరు మా పాఠశాలకు రావడం చాలా ఆనందంగా ఉందని తెలియజేశారు విద్యార్థుల మంత్రి సవితతో ఫోటోలు తీయించుకొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి చట్టబద్ధత పిల్లలకు ఆమోదం లభించిన సందర్భంగా మంత్రి సవిత విద్యార్థులు కలిసి కేక్ కట్ చేయడం జరిగింది అనంతరం విద్యార్థుల గురించి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో వ్యయ ప్రయాసలతో కూడి మీకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తూ ఉంది మీరు కూడా తగిన గుర్తింపుగా చదువుకున్న స్కూలుకు విద్యాబోధన నేర్పిన గురువులకు కని పెంచిన తల్లిదండ్రులకు మీ గ్రామాలకు మంచి పేరు తీసుకుని రావాలని విద్యార్థులకు తెలియజేయడం జరిగింది అనంతరం 18 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న నూతన ఎం జి బి భవనాలను నిర్మాణ పనులను పురోగతిని సమీక్షి పనుల నాణ్యతతో పాటు సమయానికి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్కు అధికారులను మంత్రి సవిత విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించే దిశగా బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి సౌకర్యాలు కల్పించడం కూటమి ప్రభుత్వం దేయమని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మాధవ నాయుడు వీరాంజనేయులు చిన్నమంతుడు పవన్ సిద్దన్న అశ్వర్థ అక్బర్ కే చంద్రశేఖర్ మురళి రామకృష్ణ ఉమా శంకర్ మహబూబ్ బాషా తదితరులు కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డిని కలిసిన తాడిపత్రి న్యాయవాదులు



ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డిని కలిసిన న్యాయవాదులు

**తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

తాడిపత్రి నియోజకవర్గంకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్ మరియు రెండు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్‌లు మంజూరు చేయడం జరిగింది. ఈ కోర్ట్‌లు ఏర్పాటుకు తాత్కాలిక భవనాలు చూడాలని అనంతపురం జిల్లాజడ్జికి హైకోర్టుజడ్జి ఆదేశాలు ఇవ్వడంతో జిల్లా జడ్జి ఆదేశాల మేరకు భవనాలను జూనియర్ సివిల్ జడ్జి పరిశీలించి కొన్ని భవనాలను మున్సిపల్ అధికారులకు, రెవెన్యూ అధికారులకు సూచించడం జరిగింది. ఈ విషయమై శుక్రవారం తాడిపత్రి న్యాయవాదులు ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డిని కలిసి తమకు మూడు కోర్ట్‌లు మంజూరు చేయించి నందుకు ఆయనకు ధన్యవాదాలు తెలుపుతూ కోర్ట్‌లకు అవసరమైన తాత్కాలిక భవనాలను ఏర్పాటు చేయడానికి సహకరించాలని ఎమ్మెల్యేను న్యాయవాదులు కోరారు. ఈ విషయమై రెండు రోజుల్లో అధికారులతో చర్చించి ఎక్కడ అణువుగా కోర్టులు ఏర్పాటు చెయ్యవచ్చో చర్చించి తెలియచేస్తామని త్వరలోనే కోర్ట్‌లకు అనువైన భవనాలను చూసి ప్రారంభిద్దామని ఎమ్మెల్యే న్యాయవాదులకు హామీ ఇవ్వడం జరిగింది.

# తాడిపత్రి చింతలరాయుని ఆలయం బృందావనంపై తెలుగు శాసనం

## - గుర్తించిన చరిత్రకారుడు మైనాస్వామి



బృందావనాన్ని పరిశీలిస్తున్న చరిత్రకారుడు మైనాస్వామి, జె.సి ప్రభాకర్‌రెడ్డి

**తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణంలోని పురాతన చింతల వేంకటరమణస్వామి ఆలయంలోని బృందావనంపై అచ్యుతదేవరాయల కాలానికి చెందిన తెలుగు శాసనాన్ని గుర్తించినట్లు చరిత్రకారుడు మైనాస్వామి తెలిపారు. తాడిపత్రి మున్సిపల్ మాజీ చైర్మన్ జె.సి ప్రభాకరరెడ్డితో కలిసి శుక్రవారం ఆయన ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలోని ఆళ్వారుల మండపానికి ఎదురుగా బృందావనం కనిపిస్తుంది. విశేష శిల్పాలతో అలంకరించిన "బృందావనం (తులసి కోట)"ను వైష్ణవ భక్తులైన 12 మంది ఆళ్వారులకు ప్రతీకగా వికారి నామ సంవత్సరం నిజ శ్రావణ శుద్ధ 15 నాడు అంటే సామాన్య శకం 1539 ఆగస్టులో బృందావనం నిర్మాణం జరిగినట్టు శాసనం చెబుతున్నదని చరిత్రకారుడు వివరించారు. ఈ బృందావనంపై నాలుగు యుగాలకు ప్రతీకగా శ్రీమహావిష్ణువు నాలుగు అవతారాల ప్రతిమలను అత్యద్భుతంగా మలిచారు. తూర్పున శ్రీమహావిష్ణువు, పడమర వైపున నరసింహస్వామి, ఉత్తరం వైపున శ్రీరాముడు, దక్షిణం వైపున బాలకృష్ణుడి సుందరమైన మూర్తులు కొలువై ఉన్నాయి. వైష్ణవ భక్తికి సంకేతమైన చక్రం, శంఖం, గదలతో పాటు, శైవ తత్వానికి ప్రతీకగా ఒక శివలింగం కూడా బృందావనంపై దర్శనమివ్వడం ఎంతో అరుదైన విషయమని మైనాస్వామి పేర్కొన్నారు. ఇది నాటి ప్రభువు అచ్యుత దేవరాయల భక్తికి, సర్వమత సామరస్యానికి నిదర్శనమన్నారు. ఆలయ శిల్ప సంపదను శాసనాలను పరిశీలించిన జె.సి ప్రభాకరరెడ్డి మైనా స్వామి వివరణను ఎంతో ఆసక్తిగా విన్నారు. తాడిపత్రి ప్రాంతాన్ని పర్యాటకంగా దేశ పటంలో ఉన్నతంగా నిలపాలని కృషి చేస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డిల ఆహ్వానం మేరకు చరిత్రకారుడు తాడిపత్రిని సందర్శించారు. తన పరిశోధనలో భాగంగా చింతల వేంకటరమణస్వామి ఆలయాన్ని సందర్శించిన ఆయన, అక్కడి బృందావనం మరియు దానిపై ఉన్న చారిత్రక శాసనం గురించి పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు.

**హంపి రాతి రథాన్ని తలపించే గరుడ సన్నిధి :**

తాడిపత్రి చింతలరాయుని ఆలయంలో గరుడ సన్నిధికి ప్రత్యేకంగా నిర్మించిన చిన్న ఆలయం, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హంపీ విఠలాలయంలోని రాతి రథాన్ని పోలి ఉండటం ఎంతో ఆశ్చర్యం కలిగిస్తుందని మైనాస్వామి పేర్కొన్నారు. లేపాక్షి, గోరంట్ల, కదిరి, సోమపాలెం వంటి ప్రముఖ ఆలయాలతో పోటీపడే శిల్ప సంపద తాడిపత్రి ఆలయాల్లో ఉన్నప్పటికీ, చరిత్రకారుల దృష్టి వీటిపై సరిగా పడలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అద్భుతమైన శిల్ప సంపదకు దక్కాల్సిన స్థానం దక్కలేదని, ప్రచారం మరియు సాహిత్యం చాలా తక్కువగా ఉన్నాయని ఆయన తెలిపారు. చరిత్రకారులు, విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు చేస్తున్న విద్యార్థులు ఈ ఆలయాల శిల్ప సంపద, చరిత్రపై దృష్టి సారించి వాటిని బాహ్య ప్రపంచానికి మరింతగా తెలియజేయాలని మైనాస్వామి విజ్ఞప్తి చేశారు. ఈ కార ్యక్రమంలో ఆలయ అర్చకులు, పాలకమండలి అధ్యక్షుడు చంద్రమౌళి, పరిశోధకుడు పెనుకొండ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ సేవలు అభినందనీయం



తాజా మాజీ సర్పంచులు సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాలవ

**డి.హిరేహాళ్ ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

డి. హిరేహాళ్ మండలం మలపన గుడి గ్రామ పంచా యితీ తెలుగుదేశం పార్టీ మద్దతు దారుడు తాజా మాజీ సర్పంచ్ రుద్రేశ్ సేవలను రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు కొనియాడుతు సన్మానించారు. శుక్రవారం రాయదుర్గం పట్టణంలోని తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే కాలవ డి.హిరేహాళ్ మండల తెదేపా కన్వీనర్ పాటిల్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ పదవి కాలం ఏప్రిల్ 2 న ముగియడంతో సర్పంచ్ ను సన్మానించారు. అనంతరం గ్రామంలోని సచివాలయ కార్యాలయం ఆవరణలో ఆ గ్రామ పెద్దలు, యువకులు, తెదేపా నాయకులు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించి తాజా మాజీ సర్పంచ్, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించి వారి పదవీకాలంలో గ్రామ అభివృద్ధికి, ప్రజలకు అందించిన సేవలను ఈ సందర్భంగ కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ తెలుగుదేశం నాయకులు దురుగయ్య, రాజశేఖర్, హనుమయ్య, బళ్లారి ఉమేష్, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

# నూతన మోడల్ పోస్టాఫీస్ భవనంకై ఎంపీ అంబికా లక్ష్మినారాయణ విజ్ఞప్తి

## - కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వినతిపత్రం అందజేసిన ఎంపీ అంబికా

**అనంతపురం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త బ్యూరో**



కేంద్ర శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ అంబికా

అనంతపురం పాతూరులో 1905 సంవత్సరంలో నిర్మించిన పోస్టాఫీస్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అక్కడ నూతన మోడల్ పోస్టాఫీస్ భవనం నిర్మించాలని కేంద్ర ప్రభుత్వాన్ని అనంతపురం లోక్‌సభ సభ్యులు అంబిక లక్ష్మినారాయణ కోరారు. ఈ మేరకు కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్‌కి అధికారికంగా లేఖను అందజేశారు. అనంతపురం పాతూరులో ఉన్న పోస్టాఫీస్ అక్కడి ప్రజలకు మాత్రమే కాకుండా సమీపంలోని బుక్కరాయసముద్రం మండల ప్రజలకు కూడా పోస్టల్ సేవలను అందించే ప్రధాన కేంద్రంగా పనిచేస్తోందని ఎంపీ అంబికా లక్ష్మినారాయణ పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న పోస్టాఫీస్ భవనం పూర్తిగా పాడైపోయి వినియోగానికి అనుకూలంగా లేకపోవడంతో ప్రజలకు సరైన సేవలు అందించడంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆయన తెలిపారు. ప్రజల అవసరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఆధునిక సౌకర్యాలతో నూతన మోడల్ పోస్టాఫీస్ భవనం నిర్మాణం అత్యవసరమని ఆయన కేంద్ర మంత్రికి వివరించారు. కాబట్టి అనంతపురం పాత పట్టణంలో నూతన మోడల్ పోస్టాఫీస్ భవనం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ని కలిసి ఎంపీ అంబికా లక్ష్మినారాయణ విజ్ఞప్తి చేశారు. ప్రజలకు మెరుగైన పోస్టల్ సేవలు అందేలా, నేటి బ్యాంకింగ్ వ్యవస్థకు తగ్గట్లుగా ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన ఆమోదం తెలపాలని ఎంపీ అంబికా లక్ష్మినారాయణ కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ని కోరారు.

# జిల్లా కలెక్టర్ ఆనంద్ మండలంలో విస్తృత పర్యటన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి

**యాడికి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

మండలంలోని వివిధ గ్రామాల్లో జిల్లా కలెక్టర్ ఆనంద్ పలు శాఖల అధికారులతో కలిసి శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలధార పథకంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 6వతేదీ సోమవారం యాడికి పట్టణానికి రానున్నారు. ఈ సందర్భంగా యాడికి మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేయనున్న బహిరంగసభలో ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రసంగించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ ఆనంద్ యాడికి, పిన్నేపల్లి, వచ్చారుమేకలపల్లి, రాయలచెరువు తదితర గ్రామాల్లో అధికారులతో కలిసి పరిశీలించారు.

# ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి- ఎమ్మెల్యే దగ్గుపాటి



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే, హాజరైన ఫిర్యాదుదారులు



**అనంతపురం మార్చి03 ప్రభాతవార్త**

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అర్బన్ టిడిపి కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎమ్మెల్యే అధ్వర్యంలో నిర్వహించి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులకు అందజేస్తూ తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**24మందికి రూ.15.22లక్షలు సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ:**

అర్బన్ టిడిపి కార్యాలయంలో శుక్రవారం 24 మందికి రూ.15.22లక్షలు సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22 నెలల కాలంలో 27వ విడతలో ఈ మొత్తాన్ని అర్హులైన వారికి ఆర్థిక సహాయం అందజేశామన్నారు. ఇప్పటి వరకు 550 మందికి రూ.5.50 కోట్లు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద అందజేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే 'ప్రజా దర్బార్'

## - రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ - క్యాంపు కార్యాలయంలో వినతుల స్వీకరణ




సమస్యలను తెలుసుకొంటున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ దృశ్యాలు




**ఉరవకొండ, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. జిల్లా కేంద్రం అనంతపురంలోని రామ్‌నగర్‌లోగల తన క్యాంపు కార్యాలయంలో శు క్రవారం రెండవరోజూ ఆయన ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకొని వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తమ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు లాంటివన్నారు. అర్హులైన ప్రతి పేదవానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ది చేకూరేలా చర్యలు తీసుకొంటున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నామని రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళుతున్నామని మంత్రి వివరించారు.

# గాయపడిన టిడిపి నాయకులును పరామర్శించిన విప్ కాలవ

**గుమ్మఘట్ట ఏప్రిల్ 02 ప్రభాత వార్త**



పావని ఆసుపత్రిలో పరామర్శిస్తున్న కాలవ

శుక్రవారం మధ్యాహ్నం 75 వీరాపురం సమీపంలో జరిగిన ద్విచక్ర వాహనం ఆటో ప్రమాదంలో గాయపడిన 75 వీరాపురం తాజా మాజీ సర్పంచ్ నాగరాజు , మరియు డీలర్ సత్యనారాయణ ను పరామర్శించేందుకు రాయదుర్గం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు అనంతపురం లోని పావని హాస్పిటల్‌కు వెళ్లి పరామర్శించి వైద్యులతో మాట్లాడి, గాయపడిన వారి ఆరోగ్య స్థితి గురించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెబుతూ వారికి మనోధైర్యాన్ని కల్పించారు.గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన అన్ని విధాల సహాయం సహకారాలు అందిస్తామని తెలిపారు.

### అప్పు చెల్లించనందుకు

# దౌర్జన్య కాండ..!

## - వ్యాపారి ఇంటిపై జులుం
## - సివిల్ ఇష్యూపై కదలని పోలీసులు



బాధిత రాజేష్ కుటుంబం

**అనంతపురం క్రైమ్ ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

అనంతపురం నగరంలో పట్టపగలే జులుం సాగింది. తీసుకున్న అప్పును తిరిగి చెల్లించలేదనే కారణంగా రభస చేసారంటూ బాధి తుడు వాపోయాడు. పోలీసుల దృష్టికి తీసుకెళ్లితే ఇది, సివిల్ మ్యాటర్, సామరస్యంగా పరిష్కరించుకోవాలని సలహా ఇచ్చారు. వివరాల్లోకి వెళితే పులివెందులకు చెందిన వడ్డీ వ్యాపారి గంగాధర్ ప్రముఖ వ్యాపారి రాజేష్ కు చెందిన ఆస్తిని తాకట్టు పెట్టుకొని రూ. 10 కోట్ల 5 లక్షలు వడ్డీకి అప్పుగా ఇచ్చారు. అయితే గడువు ముగిసినా కూడా తన అప్పు చెల్లించలేదని పలు మార్లు పోలీస్ స్టేషన్, పెద్ద మనుషుల వద్ద పంచాయితీ చేసుకున్నారు. అయితే చివరకు రెండు నెలల గడువు ఇవ్వడంతో అప్పట్లో వివాదం సద్దుమణిగింది. ఇచ్చిన గడువు కూడా గత నెలాఖరుకు ముగిసింది. దీంతో గంగాధర్ శుక్రవారం తన అప్పు చెల్లించమని ఒత్తిడి తెచ్చారు. అయితే తన ఆర్థిక పరిస్థితి సరిగా లేక అప్పు చెల్లించలేకపోయానని బాధితుడు మొర పెట్టుకున్నారు. మళ్ళీ ఒక నెల రోజులు సమయం కావాలని కోరినా ససేమిరా వినలేదని బాధితుడు రాజేష్ వాపోయారు. ఆఖరుకు తన విజ్ఞప్తిని అంగీకరించాలని కాళ్ళు పట్టుకున్నానని చెప్పుకొచ్చాడు. అయినా ససేమిరా ఒప్పుకోకపోగా దౌర్జన్యం చేసారన మీడియా ఎదుట ఆవేదన చెందారు. తమపై జులుం ప్రదర్శిస్తూ ఇంటి గోడను పగులగొట్టారని, ఇంట్లో వున్న వస్తువులు బయట పడేసి ఇంటికి తాళం వేశారంటూ వాపోయారు. వృద్ధాప్యంలో వున్న తల్లిదండ్రులను బయటకు తీసుకొచ్చి తమపై దౌర్జన్యం చేసారంటూ గోడును వెళ్ళబోసుకున్నారు. తనకు అదనంగా నెల రోజులు సమయం ఇస్తే వడ్డీ మొదలు రూ.12 కోట్లను ఋణదాతకు తిరిగి చెల్లిస్తానని హామీ ఇచ్చాడు. తనకు సహకరించాలని వేడుకున్నాడు.



ఇంటి గోడను ధ్వంసం చేసారని చూపిస్తున్న రాజేష్

# కనేకల్‌లో చిక్కనేశ్వర మహారథోత్సవం

## - పంచాయతీ ఆధ్వర్యంలో పూలమాలల ఘన సమర్పణ

**కనేకల్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:**

చిక్కనేశ్వర స్వామి మహారథోత్సవం సందర్భంగా కనేకల్ మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో పూలమాలల సమర్పణ కార్యక్రమం ఘనంగా జరిగింది. భక్తిశ్రద్ధలతో సిద్ధం చేసిన పూలమాలను పంచాయతీ కార్యాలయం నుండి మేళతాళాల నడుమ ట్రాక్టర్లలో ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి అందజేశారు.గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ఊరేగింపులో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారి నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. రథోత్సవం సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసి, పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు చిన్న సర్మాస్, మాజీ వార్డ్ సభ్యుడు బుషప్పతో పాటు ఎంపీడీవో విజయసింహారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి, జూనియర్ అసిస్టెంట్ మారుతి ప్రసాద్, బిల్ కలెక్టర్లు తిరుపాల్, ఇబ్రహీం అలీ, వరదరాజులు, మేస్త్రి, కంప్యూటర్ ఆపరేటర్ వినోద్, వాటర్ బాయ్స్ అల్తాఫ్, సికిందర్, జగదీష్ మరియు మల్లికార్జున పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. పంచాయతీ అధికారులు మాట్లాడుతూ, గ్రామంలో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సామాజిక ఐక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. రథోత్సవం విజయవంతంగా నిర్వహించడంలో ప్రజల సహకారంఅభినందనీయమని పేర్కొన్నారు.

# శరవేగంగా కొండపైకి రోడ్డు నిర్మాణ పనులు

## పరిశీలించిన మాజీ సర్పంచ్ బోదపాటి గోవింద

**ఉరవకొండ, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

ఉరవకొండ మండల పరిధిలోని లత్తవరం గ్రామ కొండపై వెలిసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ప్రారంభించిన రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సూచనలతో గ్రామ మాజీ సర్పంచ్ బోదపాటి గోవిందప్ప, కొర్రపాటి మల్లికార్జున ఆధ్వర్యంలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే హిటాచి, జేసీబీలతో 25వ రోజు పనులు జరుగుతుండగా పనులను శుక్రవారం మాజీ సర్పంచ్ బోదపాటి గోవిందప్ప క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు పూర్తి అవుతాయని ఆయన తెలిపారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్ బోదపాటి గోవిందప్ప తదితరులు